

చేతి యంత్రాలతో విత్తనాలు విత్తుకోవచ్చు

చేతి యంత్రాలతో విత్తనాలు విత్తుకోవచ్చని మామునూరు కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ రాజన్న తెలిపారు. - 8లో▸



ఉద్యోగులందరూ సమానమే

యూనివర్సిటీలో ఉద్యోగులందరూ తనకు సమానమేనని, ఎవరైనా నేరుగా తనను కలిసి సమస్యలు విన్నవించుకోవచ్చునని వీసీ ప్రతాప్‌రెడ్డి స్పష్టం చేశారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
$30^0 / 18^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం మంచు కురుస్తుంది. మధ్యాహ్నం ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. రాత్రి చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

వేంకటేశ్వరుడి నిజరూప దర్శనం



చిల్పూరు: చిల్పూరుగుట్ట ఆలయంలో కార్తీక మాస గురువారం భక్తులకు నిజరూప దర్శనం ఇచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు రవీందర్ శర్మ, అర్చకులు రంగాచార్యులు, కృష్ణమాచార్యుల వేద మంత్రాల నడుమ ఆలయ ఈఓ భాగం లక్ష్మీప్రసన్న ఆధ్వర్యంలో భక్తులకు దర్శన రూపం కలిగించారు. జూనియర్ అసిస్టెంట్ కుర్రెంల మోహన్, వీరన్న, భక్తులు పాల్గొన్నారు.

పారా మెడికల్ డిప్లొమా కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

జనగామ రూరల్: తెలంగాణ పారా మెడికల్ బోర్డు సెక్రటరీ నోటిఫికేషన్ అనుగుణంగా జనగామ ప్రభుత్వ వైద్య కళాశాలలో 2024–25 విద్యాసంవత్సరానికి డిప్లొమా ఇన్ మెడికల్ ఇమేజింగ్ టెక్నీషియన్ కోర్సు (రెండు సంవత్సరాలు), డిప్లొమా ఇన్ ఆప్తాలమిక్ అసిస్టెంట్ కోర్సు (2 సంవత్సరాలు)లకు గాను అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జనగామ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గోపాల్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా కోర్సులకు బైపీసీ, ఎంపీసీ ఉత్తీర్ణత అయిన విద్యార్థులు అర్హులన్నారు. దరఖాస్తులు సమర్పించుటకు ఈనెల 20 చివరి తేదీగా నిర్ణయించినట్లు తెలిపారు. పూర్తి వివరాలకు కళాశాల వెబ్‌సైట్‌లో సంప్రదించాలన్నారు.

స్టెనో, టైపిస్ట్ పోస్టుకు..

జనగామ రూరల్: జిల్లా కోర్టులో స్టెనో, టైపిస్ట్ పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ గురువారం ఒక ప్రకటనలో పేర్కొంది. జిల్లా కోర్టులో జనరల్ కేటగిరీలో స్టెనో కం టైపిస్టు పోస్టు ఉన్నట్లు తెలిపారు. డిగ్రీ అర్హతతో పాటు టైప్ రైటింగ్‌లో సర్టిఫికెట్, 34 సంవత్సరాల లోపు వయసు ఉన్న వారు అర్హులన్నారు. ఆసక్తిగల వారు ఈ నెల 20లోపు చైర్మన్, డిస్ట్రిక్ లీగల్ సర్వీసెస్ అథారిటీ, న్యాయ సేవా సదన్, జిల్లా కోర్టు, జనగామ చిరునామాకు పోస్టు ద్వారా పంపించాలన్నారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి



రఘునాథపల్లి: మండలంలోని ఎల్లారెడ్డిగూడెంలో దళితుడు గంపల పరుశరాములును హత్య చేసిన నిందితుడికి వెంటనే శిక్ష పడేలా ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి కఠినంగా శిక్షించాలని ఎంఎస్పీ రాష్ట్ర నాయకుడు కొయ్యడ మల్లేషమాదిగ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హత్య చేసిన నిందితుడిపై హత్యానేరం, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ, పీడీయాక్ట్ నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా దళిత సంఘాల నాయకులు డాక్టర్ బొల్లపల్లి కృష్ణ, గిరిమల్ల రాజ, కందుకూరి ప్రభాకర్, రాగల ఉపేందర్, సుంచు రాజు, రవీందర్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

సోమేశ్వరాలయంలో కార్తీక దీపోత్సవం



పాలకుర్తి టౌన్: సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో కార్తీక మాస ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి ఆలయ కల్యాణ మండపం ఆవరణంలో కార్తీక దీపోత్సవంలో స్వామివారికి అభిషేకం నిర్వహించారు. కార్తీక దీపోత్సవంలో పాల్గొన్న మహిళలకు ఆలయ ఈఓ సల్వాది మోహన్‌బాబు తాంబులం, స్వామి వారి ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ కొత్తపల్లి వెంకటయ్య, అర్చకులు డీవీఆర్ శర్మ, అనిల్‌కుమార్, నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.



ఆర్డీఓ ఉమారాణికి కేక్ తినిపిస్తున్న బాలిక



పిల్లల మధ్యలో కూర్చొని షేక్ హ్యాండ్ ఇస్తూ కబుర్లు చెబుతున్న ఎస్పీ సుధీర్ రాంనాథ్

సాక్షి స్పెషల్

మీ ఎదుగుదలకు అండగా ఉంటాం

- నర్సంపేట ఆర్డీఓ ఉమారాణి
- పిల్లలకు పోటీలు నిర్వహించి బహుమతుల ప్రదానం

సాక్షి మీడియా ఆధ్వర్యంలో నర్సంపేటలోని సంజీవని చైల్డ్‌హోంలో గురువారం బాలల దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆర్డీఓ ఉమారాణి హాజరై చిన్నారులతో ముచ్చటించారు. డ్రాయింగ్‌తోపాటు పలు అంశాల్లో పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. తల్లిదండ్రులు లేని పిల్లలు ఎంతో ఆందోళనకు గురవుతారు.. వారి భవిష్యత్ ఎదుగుదలకు అండగా ఉంటామని ఆర్డీఓ ఉమారాణి భరోసా ఇచ్చారు. - నర్సంపేట

షేక్‌హ్యాండ్ ఇచ్చి... కేక్ తినిపించి..

- పిల్లల పోషణకు సహకారం : ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్

'సాక్షి' మీడియా ఆధ్వర్యంలో మహబూబాబాద్ పట్టణంలోని దైవకృప చైల్డ్‌హోంలో గురువారం బాలల దినోత్సవ కార్యక్రమం జరిగింది. మహబూబాబాద్ ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్.. పిల్లలతో కలిసిపోయి సరదాగా కబుర్లు చెప్పారు. షేక్‌హ్యాండ్ ఇచ్చి ఆప్యాయంగా పలకరించారు. కేక్ కట్ చేసి అందరికీ తినిపించారు. పిల్లల పోషణ, వారి అవసరాలను తీర్చేందుకు తమ వంతు సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. - మహబూబాబాద్

'సాక్షి' మీడియా ఆధ్వర్యంలో నర్సంపేట, మహబూబాబాద్‌లోని చైల్డ్‌హోంలలో బాలల దినోత్సవం

- పూర్తి వివరాలు 8లో▸

లక్ష్యం 10/10

జిల్లాలో కొనసాగుతున్న ప్రత్యేక తరగతులు



ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

- వెనకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయుల ప్రత్యేక దృష్టి
- జిల్లాలో 6,401 మంది టెన్త్ విద్యార్థులు

జనగామ రూరల్: పదో తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకుంటున్నారు. రాష్ట్రంలో మొదటి స్థానం లక్ష్యంగా పక్కా ప్రణాళికలతో ముందుకెళ్తున్నారు. గతేడాది 90శాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలలు ఈ సారి వందశాతం వచ్చేలా కృషి చేస్తున్నారు. వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా ఈ నెల 1 నుంచి జిల్లా పరిషత్ ఉన్నత, మోడల్ స్కూల్స్, కేజీబీవీలోని పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. మొదటి విడతలో 60 రోజుల యాక్షన్ ప్లాన్‌లో సాయంత్రం 4:20 నుంచి 5:20 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నారు. ఇందులో సకాలంలో సిలబస్ పూర్తి చేసి, రివిజన్ చేయనున్నారు. మొదటి రోజు సాంఘిక శాస్త్రం, రెండో రోజు హిందీ, మూడోరోజు గణితం, నాలుగో రోజు ఆంగ్లం, ఐదో రోజు ఫిజికల్ సైన్స్, ఆరో రోజు సోషల్, ఏడో రోజు బయోలజీ సబ్జెక్టులకు ప్రత్యేక తరగతులు నిర్వహించేలా ప్రణాళిక రూపొందించారు.

జిల్లాలో ఉత్తీర్ణత శాతం వివరాలు

విద్యాసంవత్సరం	ఉత్తీర్ణత శాతం
2019-2020	100
2020-2021	100
2021-2022	94.72
2022-2023	96.45
2023-24	98.16

తరగతుల నిర్వహణ ఇలా..

జిల్లావ్యాప్తంగా 103 ఉన్నత పాఠశాలలు, 12 కేజీబీవీలు, 8 మోడల్ స్కూల్స్, 19 గురుకులాలు విద్యాలయాలు ఉండగా.. 6,401 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ఆయా పాఠశాలల్లో ప్రత్యేక తరగతుల నిర్వహణకు పక్కా ప్రణాళికలను రూపొందించారు. ఈ నెల 1 నుంచి డిసెంబర్ 31వ తేదీ వరకు రోజు సాయంత్రం 4:20 నుంచి 5:20 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నారు. జనవరి 1 నుంచి వార్షిక పరీక్షల వరకు ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4:20 నుంచి 5:20 గంటల వరకు రెండు పూటలా తరగతులు నిర్వహిస్తారు. అందులో రెగ్యులర్ తరగతులు బోధించకుండా పునశ్చరణ, మూల్యాంకనంపై ప్రత్యేక దృష్టి సారించాల్సి ఉంది. విద్యార్థుల సామర్థ్యాల ఆధారంగా పరీక్షలు నిర్వహించాలి. విద్యార్థులు రాసిన జవాబులను పరిశీలించి, చర్చలతో సరిదిద్దాలి. విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా వార్షిక పరీక్షలకు సన్నద్ధం చేయాల్సి ఉంటుంది. 2023–24 విద్యా సంవత్సరం పదో తరగతి వార్షిక పరీక్షల్లో శాతం 98.16 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించి రాష్ట్రస్థాయిలో 4వ స్థానంలో నిలిచింది.

ప్రత్యేక తరగతులతో పూర్తి అవగాహన



ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. రోజూ సాయంత్రం ప్రత్యేక తరగతులు తీసుకుంటూ ముఖ్యమైన అంశాలు చదివిస్తున్నారు. జవాబు పత్రాలను పరిశీలించి తప్పులు ఉంటే సరిదిద్దుతున్నారు. అర్థం కాని విషయాలను మళ్లీ చెబుతున్నారు.

- ఆకాష్, టెన్త్ విద్యార్థి, శామీర్‌పేట ఉన్నత పాఠశాల

స్నాక్స్ ఇస్తే బాగుంటుంది..



ఉదయం 8.30 గంటలకు ఉన్నత పాఠశాలకు వస్తాం. స్పెషల్ క్లాసులు ముగించుకుని ఇంటికి తిరిగి వెళ్లే సరికి రాత్రి 7 గంటలు అవుతుంది. దీంతో చాలా నీరసించి పోతున్నాం. పదోతరగతి విద్యార్థులకు సాయంత్రం వేళ స్నాక్స్ ఇస్తే కొంత ఆకలి బాధ తీరుతుంది.

- భూక్య శ్రీమన్, శివునిపల్లి జెడ్పీఎస్ఎస్

ప్రణాళికాబద్ధంగా తరగతులు



పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత దాదాపుగా తీరింది. ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించే లక్ష్యంతో ఉపాధ్యాయులు ప్రణాళిక రూపొందించుకుని ముందుకు సాగాలి. ప్రత్యేక తరగతుల కోసం విధిగా రిజిస్టర్ నిర్వహించాలి. అవసరమైతే అధికారులతో తగిన సలహాలు, సూచనలు తీసుకోవాలి.

- కె రాము, జిల్లా విద్యాశాఖ అధికారి


మొదటి స్థానమే లక్ష్యం..



ఈ ఏడాది వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ఉపాధ్యాయులు కృషి చేయాలి. సమష్టి కృషితో విద్యార్థులతో ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లాలి. పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేస్తున్నాం. ఎప్పటికప్పుడు విద్యాశాఖ అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించి తగు సూచనలు ఇస్తున్నాం.

- రిజ్వాన్ బాషా, కలెక్టర్

దీప ప్రజ్వలనం.. గిరి ప్రదక్షిణం



విద్యుత్ దీపాల వెలుగులో సోమేశ్వరస్వామి గుట్ట



గుట్టపై వెలుగుతున్న అఖండ జ్యోతి దర్శనం(ఫైల్)

- నేడు పాలకుర్తి క్షీరగిరిపై అఖండజ్యోతి

పాలకుర్తి టౌన్: శబరిమల మకరజ్యోతి మాదిరి క్షీరాద్రి శిఖరమైన పాలకుర్తి శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి క్షేత్రంలో కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని శుక్రవారం అతిపెద్ద 'అఖండజ్యోతి' దర్శనానికి ఏర్పాట్లు చేశారు. పాలకుర్తి క్షీరగిరి చుట్టూ గిరి ప్రదక్షిణ అనంతరం కొండపై ఏర్పాటు చేస్తున్న భారీ ప్రమిదలో టన్ను నువ్వుల నూనె, ఆవు నెయ్యి, 2 క్వింటాళ్ల ముద్ద కర్పూరంతో అతిపెద్ద అఖండజ్యోతిని ఏర్పాటు చేశారు. పాలకుర్తి శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయం దక్షిణ భారతదేశంలో మూడో అఖండజ్యోతి నిర్వహిస్తుంది. 8 అడుగుల వెడల్పు, 4 అడుగుల ఎత్తులో ప్రత్యేకంగా రూపొందించిన దీపబండాన్ని పాలకుర్తి శిఖరాగ్రవేదికపై ఏర్పాటు చేశారు. వేలాదిగా తరలివచ్చే భక్తుల సమక్షంలో సాయంత్రం 5గంటలకు గిరిప్రదక్షిణ అనంతరం 6:00 గంటలకు అఖండ జ్యోతిని వెలిగిస్తారు. కాగా, 2013లో క్షీరగిరిపై అఖండ జ్యోతి దర్శనం ఏర్పాటును ప్రారంభించారు.

ముఖ్య అతిథులుగా పీఠాధిపతులు, మంత్రి సురేఖ

శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా అఖండ జ్యోతి దర్శనం ప్రారంభానికి ముఖ్యఅతిథిగా ఉత్తరకాశీ పీఠాధిపతులు స్వామి స్థిత ప్రజ్ఞానంద సరస్వతి, మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి హాజరు కానున్నారు.

ఏర్పాట్లు పూర్తి..



శబరిమలై మకరజ్యోతి మాదిరి నేడు(శుక్రవారం) కార్తీక పౌర్ణమి రోజున శ్రీసోమేశ్వర ఆలయంలో నిర్వహించే అఖండజ్యోతి దర్శనానికి అన్ని ఏర్పాట్లు చేశాం. రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరానున్నారు. ఆలయం పరిసరాలు విద్యుత్ దీపాలతో అలంకరించాం.

-సల్వాది మోహన్‌బాబు, ఈఓ

జీడికల్ జాతర షురూ



గల్లపూజ నిర్వహిస్తున్న వేదపండితులు

లింగాలఘణపురం: మండలంలోని జీడికల్ వీరాచల రామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలను వేద పండితులు శ్రీనివాసాచార్యులు, భార్గవాచార్యులు, మురళీధరాచార్యులు గురువారం రాత్రి గల్లపూజతో ప్రారంభించారు. ఉత్సవ విగ్రహాలను ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసి బ్రహ్మోత్సవాల తంతును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఈఓ వంశీ, జనగామ ఉప్పలమ్మ గుడి ఈఓ కె.కె.రాములు, మాజీ దేవస్థాన చైర్మన్ మూర్తి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన



తేమ శాతాన్ని పరిశీలిస్తున్న డీసీపీ

జనగామ: స్థానిక వ్యవసాయ మార్కెట్‌లోని పత్తి యార్డులో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డీసీపీ రాజమహేందర్ నాయక్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మార్కెట్‌లో ఏర్పాట్లు, సౌకర్యాలపై మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్ డీసీపీకి వివరించారు. రైతులను ఇబ్బందులకు గురిచేయకుండా ధాన్యం కొనుగోళ్లు నిర్వహించాలని డీసీపీ సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ దామోదర్ రెడ్డి, మార్కెట్ ప్రత్యేక శ్రేణి సెక్రటరీ శ్రీనివాస్, సూపర్‌వైజర్, శ్రీనివాస్, ఏఈఓ అనిల్, ఐకేపీ సెంటర్ నిర్వాహకులు, రైతులు శ్రీనివాస్, రాజు, రమేష్ పాల్గొన్నారు.

బంగారు భవిష్యత్‌కు పునాదులు వేసుకోవాలి

- డీఈఓ కె.రాము



విద్యార్థులతో డీఈఓ రాము

దేవరుప్పుల: ప్రాథమిక, ఉన్నత విద్యాబోధన స్థాయిలోనే విద్యార్థులు ఉజ్వల భవిష్యత్‌కు పునాదులు వేసుకోవాలని జిల్లా విద్యాధికారి కె.రాము అన్నారు. గురువారం మండల కేంద్రంలోని బాలయేసు హైస్కూల్‌లో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని జవహర్‌లాల్ నెహ్రూ జీవిత చరిత్ర స్ఫూర్తితో విద్యార్థుల్లో సృజనాత్మక విద్యను పెంపొందించేందుకు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ ప్రయోగాత్మక విద్యను అలవర్చుకున్న విద్యార్థులు భవిష్యత్‌లో ఆశించిన రంగాల్లో రాణిస్తారన్నారు. లక్ష్యసాధనకు అంకితభావంతో చదివి తల్లిదండ్రుల కలలు సాకారం చేస్తూ సమాజ అభివృద్ధికి అడుగులు వేసేలా తయారు కావాలన్నారు. అంతకుముందు లీడర్ల ప్రమాణస్వీకారోత్సవంలో పాల్గొన్నారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ బ్రదర్ జేసురాజు, ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదును సద్వినియోగం చేసుకోవాలి

- కలెక్టర్ రిజ్వాన్ బాషా



మాట్లాడుతున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా



చిన్నారికి కేక్ తినిపిస్తున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

జనగామ రూరల్: ప్రత్యేక ఓటరు నమోదును సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో 7,57,982 ఓటర్లు ఉన్నారని, ఇటీవల 9, 0వ తేదీల్లో నిర్వహించిన ఓటరు నమోదు క్యాంపెయిన్‌లో జిల్లాలోని పోలింగ్ కేంద్రాలకు 505 దరఖాస్తులు వచ్చాయన్నారు. అలాగే మళ్లీ ఈ నెల 23, 24వ తేదీల్లో నిర్వహించే ప్రత్యేక ఓటరు నమోదులో కొత్త ఓటర్ల నమోదు, సవరణలు చేసుకోవచ్చని, బీఎల్‌ఓలు ఆయా పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉంటారని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇప్పటివరకు టీచర్స్ ఎంఎల్‌సీ నియోజకవర్గంలో 1,067 దరఖాస్తులు అందగా, వాటిలో 819 దరఖాస్తులను ఆమోదించామన్నారు. ఈ నెల 23న ముసాయిదా జాబితాను విడుదల చేసి, వచ్చే నెల డిసెంబర్ 12వ తేదీ వరకు అభ్యంతరాలను స్వీకరించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో ఎన్నికల సూపరింటెండెంట్ శ్రీకాంత్, వివిధ పార్టీల ప్రతినిధులు బి.భాస్కర్, జోగు ప్రకాష్, రావెల రవి, అజయ్ కుమార్, విజయ్ భాస్కర్, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కులను కాపాడాలి

బాలల హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రతిఒక్కరి ఉందని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని బాల సదనంలో మహిళా, పిల్లలు, దివ్యాంగులు, వయోవృద్ధుల శాఖ, బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో జిల్లా సంక్షేమ అధికారిణి డి.ఫ్లోరెన్స్ అధ్యక్షతన జాతీయ బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని, వారి అభ్యున్నతికి పాటుపడాలన్నారు. పిల్లలందరూ చదువుకుంటేనే సమాజంలో గౌరవం లభిస్తుందన్నారు. అనంతరం నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అంతకుముందు ఎకనామిక్ రీహాబిలిటేషన్ పథకం (ఆర్థిక ప్రోత్సాహం) కింద దివ్యాంగ లబ్ధిదారులకు (మండలానికి ఒకటి చొప్పున, మున్సిపాలిటీ ఒకటి) మొత్తం 13 మందికి రూ. 50,000 చెక్కులను కలెక్టర్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం అధికారి ఎల్.రవికాంత్, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ ఉప్పలయ్య, శ్రీలత, కవిత, వేరోనికా, స్వప్న రాణి, స్రవంతి, కృష్ణవేణి పాల్గొన్నారు.

సీతారాముల కల్యాణానికి ఆహ్వానం

లింగాలఘణపురం: మండలంలోని జీడికల్ వీరాచల రామచంద్రస్వామి ఆలయంలో ఈ నెల 20న జరిగే వీరాచల రామచంద్రస్వామి కల్యాణోత్సవానికి హాజరు కావాలని దేవస్థాన ఈఓ వంశీ గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ రిజ్వాన్ బాషాను కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఆయన వెంట జనగామ ఉప్పలమ్మ దేవాలయం ఈఓ రాములు, మూర్తి తదితరులు ఉన్నారు.

జిల్లాలో 5,446 మంది అభ్యర్థులు

జనగామ రూరల్: జిల్లాలో మొత్తం 5,446 మంది గ్రూప్–3 అభ్యర్థులు హాజరు కానున్నట్లు కలెక్టర్ రిజ్వాన్ బాషా తెలిపారు. ఈ మేరకు గురువారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్, అధికారులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ఈ వీసీలో ఆర్డీఓలు గోపిరాం, వెంకన్న, ఏసీపీ పార్థసారథి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎఫ్‌ఐ 50 ఏళ్లుగా కొనసాగుతోంది..

వరంగల్ స్పోర్ట్స్: హ్యాండ్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా 50 సంవత్సరాలుగా అనేక అంతర్జాతీయ క్రీడాకారులను తీర్చిదిద్దిందని తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి శ్యామల పవన్‌కుమార్ స్పష్టం చేశారు. 'సాక్షి'లో గురువారం 'ఒకే క్రీడ .. రెండు సంఘాల' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి స్పందించారు. గ్రామీణ స్థాయిలో ప్రతిభ గల హ్యాండ్‌బాల్ క్రీడాకారులను గుర్తించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా శిక్షణ అందించిన ఘనత హెచ్‌ఎఫ్‌ఐది అన్నారు. కేవలం రెండు సంవత్సరాల క్రితం హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఇండియాతో కొత్త సంఘం ఏర్పాటైందన్నారు. దీనికి సాయ్, శాట్‌ల నుంచి సహకారం లేదని, హెచ్‌ఎఫ్‌ఐకే అనుకూలంగా ఉన్నాయని తెలిపారు. త్వరలో కోర్టు తీర్పు కూడా హెచ్‌ఎఫ్‌ఐకి అనుకూలంగా రానుందని తెలిపారు.

యథావిధిగా రైళ్ల రాకపోకలు

కాజీపేట రూరల్: పెద్దపల్లి జిల్లాలో జరిగిన గూడ్స్ రైలు ఘటనతో బుధవారం రద్దు, దారి మళ్లింపు, రీషెడ్యూల్ అయిన రైళ్లు గురువారం నుంచి యథావిధిగా నడుస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. బల్హార్షా–విజయవాడ– సికింద్రాబాద్ రూట్‌లో కాజీపేట మీదుగా ప్రయాణించే రైళ్లన్నీ యథావిధిగా నడుస్తున్నట్లు చెప్పారు. గూడ్స్ ఘటనలో సికింద్రాబాద్– దానాపూర్ ఎక్స్‌ప్రెస్ గురువారం రద్దయిందన్నారు. శుక్రవారం నుంచి యథావిధిగా నడవనున్నట్లు తెలిపారు.

నేడు 'డయల్ యువర్ ఆర్‌ఎం'

హన్మకొండ: ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు అవసరమైన సలహాలు, సూచనలు తెలుసుకునేందుకు శుక్రవారం డయల్ యువర్ ఆర్‌ఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ వరంగల్ ఆర్‌ఎం డి.విజయభాను తెలిపారు. మధ్యాహ్నం 12 నుంచి 1 గంట వరకు డయల్ యువర్ ఆర్‌ఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వివరించారు. ప్రయాణికులు 9959226056 నంబర్‌కు ఫోన్ చేసి తమ సమస్యలు వివరించి సలహాలు, సూచనలు అందించాలని కోరారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ మావద్ద BA & MA లో హిందీ Lit కొరకు ఓపెన్ 10th, ఇంటర్, డిగ్రీ, పి.జి. & MBA, B.Tech, LLB, ITI, డిప్లొమా, ఫార్మసీ, నర్సింగ్, B.Sc (Agri), B.Ed, B.P.Ed ల కై. 9948131154.
[Y_1145761]

REAL ESTATE

TO-LET

■ WGL, కరీమాబాద్, బొమ్మలగుడి దగ్గర మెయిన్‌రోడ్ గ్రౌండ్ ఫ్లోర్ డీలక్స్ రూమ్స్ 2 BHK కిరాయికి ఇవ్వబడును. గోశాల ప్రక్కన. సంప్ర: 9848696291
[W-1264021]

FOR SALE

■ 18000 Sq. Feets TDR కలదు. బిల్డర్లకు మరియు Land Owners TDR అమ్మబడును. GWMC Limits. Cell: 9885301652 (సేమ్ డే డ్రై క్లీనర్స్, హన్మకొండ).
[WA-7543]

SERVICES

PEST CONTROL

■ చెదలు & బొద్దింకల నివారణ & మీ విలువైన ఇండ్లకు & కొత్తగా నిర్మించే భవనములకు కెమికల్ ట్రీట్‌మెంట్ చేయబడును. వాటర్ ప్రూఫింగ్ సర్వీసెస్ – GHANA SRI. Cell: 9676982085
[W-1239943]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన రూ.. 260/– అదనపు లైను రూ.. 60/– మాత్రమే 5% GST అదనము

WANTED

■ రియల్ ఎస్టేట్ Co. HYD, కోకాపేట్, శంకర్‌పల్లిలో విల్లాస్/ప్లాట్స్ సేల్స్‌కై మార్కెటింగ్ Exe. కావలెను. జీ/కమీషన్ + 2వీలర్ + రూం+భో ఫ్రీ, నె॥లక్ష రూ॥. ఫ్రెష్/Exp. ఫోన్. 7416396781
[HA-16464]

WANTED TEACHERS

■ Wanted Social Teacher to teach 7th to 10th Class, 4 Periods. ST.THERESA SCHOOL, Nekkonda. Cell: 8801802586, 9397696508.
[W-1264054]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ	9010144453
వరంగల్	9705748198
నర్సంపేట	9553955722
జనగామ	9951602871
మహబూబాబాద్	9010144453
పరకాల	9010299096
జయశంకర్ భూపాలపల్లి	9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

షేక్‌హ్యాండ్ ఇచ్చి... కేక్ తినిపించి..

చైల్డ్ హోం పిల్లలతో సరదాగా గడిపిన ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్

- పిల్లల అవసరాలు తీర్చేందుకు సహకారమందిస్తా
- 'సాక్షి' మీడియా ఆధ్వర్యంలో మహబూబాబాద్ చైల్డ్ హోంలో బాలల దినోత్సవం


పిల్లలతో కలిసి కేక్ కట్ చేస్తున్న ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్

మహబూబాబాద్ : 'వారిలో కొందరు అమ్మానాన్నలు లేనివారు.. మరికొందరు విధి వంచితులు ఉన్నారు.. తమ వారు ఎక్కడ ఉన్నారో తెలియదు.. ముక్కుపచ్చలారని వయసులో చైల్డ్‌హోం నిర్వాహకులే అమ్మానాన్నలు, సాటి బాల బాలికలే అన్నాదమ్ముళ్లు.. అక్కా చెల్లెళ్లుగా జీవిస్తున్నారు. వీరితో మహబూబాబాద్ ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ సరదాగా గడిపారు.. చిట్టి చేతులకు షేక్ హ్యాండ్ ఇచ్చారు.. మానసిక పరిపక్వత లేని బాలలతో ముచ్చటించారు. పేరు అడిగారు..ఏం చదువుతున్నావో చెప్పమన్నారు.. బాగా చదువుకోవాలి అని చెప్పి ఒప్పించారు. వారి మధ్యలో కూర్చుని కబుర్లు చెప్పారు.. కేక్ కట్‌చేసి సంబురాలు పంచుకున్నారు. కేక్ తినిపించి ఆప్యాయత పంచారు. ఈ ఆనందకర ఘటన గురువారం 'సాక్షి' మీడియా, దైవ కృప వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మహబూబాబాద్ పట్టణంలో నిర్వహించిన బాలల దినోత్సవ కార్యక్రమంలో జరిగింది.

కేక్ కట్ చేసి.. పిల్లల మధ్య కూర్చుని కబుర్లు

బాలల దినోత్సవం సందర్భంగా దైవ కృప చైల్డ్‌హోంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పిల్లల మధ్య కూర్చుని వారితో ముచ్చటించారు. వారిలో ఒక చిన్నారి తన పేరు 'నాని' అని చెప్పడంతో హీరో నాని అంటూ పొగిడారు. అనంతరం పిల్లలతో కలిసి కేక్ కట్ చేశారు. వారిలో ఇద్దరు పిల్లలను ఎత్తుకుని వారికి కేక్ తినిపించారు. ఆట, పాటల్లో గెలుపొందిన వారితోపాటు, పిల్లలందరికీ కంపాక్స్‌లు, పరీక్ష ప్యాడ్స్, వాటర్ బాటిల్స్, తదితర బహుమతులు అందజేశారు. పండ్లు, బిస్కెట్లు, పంపిణీ చేశారు.

పిల్లలు దేవుడిచ్చిన వరం

పిల్లలు దేవుడు ఇచ్చిన వరమని, వారికి సేవ చేసే అవకాశం రావడం అదృష్టంగా భావించి పనిచేయాలని ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్.. నిర్వాహకులకు సూచించారు. పిల్లల విద్య, ఆరోగ్యం విషయంలో శ్రద్ధ పెట్టాలన్నారు. ఉన్నత స్థాయికి ఎదిగిన వారి చరిత్రలు చెప్పాలన్నారు. సమాజంలోని మంచి పౌరులుగా తీర్చిదిద్దితే వారి భవిష్యత్ బంగారు మయం చేసిన వారవుతారన్నారు. పిల్లల పోషణ, వారి అవసరాలను తీర్చేందుకు తమ వంతు సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. వారిలో అనాథలం, ఎవరూ లేని వారం అనే భావన రాకుండా చూడాలన్నారు. చిన్నప్పటి నుంచే మనోధైర్యం నింపాలని చెప్పారు. పిల్లలు శ్రద్ధగా చదువుకుని ఉన్న స్థాయికి ఎదగాలన్నారు.

వార్తలకే పరిమితం కాకుండా..

మీడియా అంటే హడావుడి.. వార్తలు, కథనాల పేరుతో బీజీగా ఉంటారు.. కానీ'సాక్షి' వార్తలకే పరిమితం కాకుండా ఇలాంటి కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. మంచి వార్తలు రాసి సమాజాన్ని సన్మార్గంలో నడిపించేందుకు యత్నించాలని చెప్పారు. బాలల దినోత్సవం సందర్భంగా చైల్డ్ హోంలో కార్యక్రమాన్ని నిర్వహించి నన్ను ఆహ్వానించిన 'సాక్షి' మీడియా, దైవ కృప వెల్ఫేర్ సొసైటీ నిర్వాహకులను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానన్నారు. ఈకార్యక్రమంలో చిల్డ్రన్స్ ప్రొటెక్షన్ ఆఫీసర్ బి. వీరన్న, 'సాక్షి' స్టాఫ్ రిపోర్టర్ ఈరగాని భిక్షం, ఆర్‌సీ ఇన్‌చార్జ్ అగ్రం రమేశ్ చందర్, అర్బన్ రిపోర్టర్ కిరణ్, 22 మంది పిల్లలు , సిబ్బంది పాల్గొన్నారు.


పిల్లలకు గిఫ్టులు ఇస్తున్నఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్

దాతల సహకారం మరువలేనిది..



ఆర్ఫన్స్, సెమీ ఆర్ఫన్స్‌తోపాటు, వృద్ధులు, మానసిక దివ్యాంగులకు సేవ చేయాలని లక్ష్యంతో సంస్థను నిర్వహిస్తున్నా. పిల్లల చదువులు, వారికి బలమైన ఆహారం కోసం దాతల సహకారం మరువలేనిది. వారి ప్రోత్సాహంతోనే పిల్లలను పోషిస్తున్నా. పిల్లలను మంచి పౌరులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తా.

–బి. లోకేశ్, చిల్డ్రన్స్ హోం నిర్వాహకుడు

సంతోషంగా ఉంటాం



నా చిన్నప్పుడు హోంలో చేరా. ఇప్పుడు తొమ్మిదో తరగతి చదువుతున్నా. హోంలో ఉన్న వారందరం ఒకరికొకరం అన్నట్లు ఉంటాం. పండుగలు, ప్రత్యేక రోజుల్లో హోంకు వచ్చే దాతలు, వారు చూపించే ఆప్యాయత మర్చిపోలేం. బాగా చదువుకుని ఉన్నత ఉద్యోగం సాధిస్తా. నాలాంటి పిల్లలకు సేవ చేస్తా.

సాయి చరణ్, 9వ తరగతి

సార్ చూపించిన ఆప్యాయత మరిచిపోలేం



ఈరోజు మా హోంకు వచ్చిన ఎస్పీ సార్, ఇతర పెద్దలు మాతో ఆప్యాయంగా గడిపారు. గిఫ్టులు ఇచ్చారు. సార్ మా మధ్యలో కూర్చుని అందరి పేర్లు అడిగి తెలుసుకున్నారు. తమ్ముళ్లకు షేక్ హ్యాండ్ ఇచ్చారు. కేక్ తినిపించారు. సార్ చూపించిన ఆప్యాయత మరిచిపోలేం. సార్ చెప్పినట్లు కష్టపడి బాగా చదువుతా..

జగదీశ్, 9వ తరగతి

మీ ఎదుగుదలకు అండగా ఉంటాం

- నర్సంపేట ఆర్డీఓ ఉమారాణి
- 'సాక్షి' మీడియా ఆధ్వర్యంలో నర్సంపేటలోని సంజీవని చైల్డ్‌హోంలో బాలల దినోత్సవం

సాక్షి స్పెషల్


విద్యార్థినులకు బహుమతులు అందజేస్తున్న ఆర్డీఓ ఉమారాణి

నర్సంపేట: తల్లిదండ్రులు లేని అనాథలు ఎంతో ఆందోళనకు గురవుతారు.. వారి ఎదుగుదలకు అండగా ఉంటాం.. మీరు (అనాథపిల్లలు) క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసిస్తూ భవిష్యత్‌లో ఉన్నత స్థానానికి చేరుకోవాలని నర్సంపేట ఆర్డీఓ ఉమారాణి అన్నారు. 'సాక్షి' మీడియా ఆధ్వర్యంలో నర్సంపేటలోని సంజీవని చైల్డ్ హోంలో గురువారం బాలల దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆర్డీఓ ఉమారాణి.. చిన్నారుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. డ్రాయింగ్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించారు.

'సాక్షి' కృషి అభినందనీయం..

'సాక్షి'మీడియా ఆధ్వర్యంలో బాలల దినోత్సవం సందర్భంగా విద్యార్థుల ప్రతిభ వెలికి తీసే విధంగా పలు కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని ఆర్డీఓ అన్నారు. పర్యావరణ పరిరక్షణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. బాలల దినోత్సవం సందర్భంగా చిన్నారులకు ప్రోత్సాహం అందిస్తూ బహుమతులు ఇవ్వడం సంతోషకరమని తెలిపారు.

విద్యార్థులతో మాటామంతీ...

పర్యావరణంతోపాటు చెట్లు, జంతువుల ఆవశ్యకత అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు వేసిన డ్రాయింగ్‌ను పరిశీలించారు. పోటీ పరీక్షల్లో ఉత్తమంగా రాణించాల్సిన అవసరం ఉందని సూచనలు చేశారు. విద్యార్థుల జీవన విధానం తెలుసుకున్నారు. విద్యార్థులకు అందే సౌకర్యాలపై ఆరా తీశారు. చైల్డ్ హోం నిర్వాహకులు అందిస్తున్న సేవలు తెలుసుకుని సంతోషం వ్యక్తం చేశారు. విద్యార్థులు, చైల్డ్ హోం అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. ఆర్డీఓ సమయం కేటాయించి ముచ్చటించడం విద్యార్థులకు సంతోషం కలిగింది.

ఉత్తమ ఫలితాలు సాధించాలి..

'విద్యార్థుల్లో ఎలాంటి ఆందోళన ఉండొద్దు.. హోం నిర్వాహకులు అందిస్తున్న సహకారంతో ఉత్తమ ఫలితాలు సాధించాలి.. కష్టాలు ధైర్యంగా ఎదుర్కొని భవిష్యత్‌లో మంచి స్థానంలో నిలవాలి.. కష్టాలు వచ్చాయనే భావన విద్యార్థుల్లో లేకుండా తొలగిపోతాయనే నమ్మకంతో ముందుకు సాగాలి' అని వనప్రేమి అవార్డు గ్రహీత గోకా రామస్వామి తెలిపారు. సమాజం అంతా మనతో ఉందనే భావనతో లక్ష్యం ఎంచుకుని గమ్యాన్ని చేరుకునే వరకు కష్టపడుతూనే ఉండాలని సూచించారు.

కేక్‌కట్ చేసి స్వీట్లు పంచి..

బాలల దినోత్సవం సందర్భంగా ఆర్డీఓ ఉమారాణి.. చిన్నారులతో కలిసి కేక్‌కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. విద్యార్థులకు పెన్నులతో పాటు మోడల్స్ అందజేశారు. గంటకు పైగా విద్యార్థులతో ముచ్చటించి సంతోషించారు. ఈ కార్యక్రమంలో 'సాక్షి' ఆర్‌సీ ఇన్‌చార్జ్ అబ్బు వెంకట్‌రెడ్డి, ముత్తోజు కిరణ్, గంధ్రోతు రమేశ్, చైల్డ్ హోం నిర్వాహకులు డాక్టర్ మోహన్‌రావు, వినోద, తదితరులు పాల్గొన్నారు.

మీడియా పాత్ర గొప్పది ..

అన్ని రంగాల అభివృద్ధి మీడియా పాత్ర గొప్పగా ఉంటుందని, ప్రజల అవసరాలను ప్రభుత్వానికి తెలియజేయడం.. ప్రభుత్వ నిర్ణయాలను ప్రజలకు తెలియజేయడమే కాకుండా కరోనా, ఎన్నికల లాంటి ప్రత్యేక పరిస్థితుల్లో కూడా మీడియా సేవలు గొప్పవన్నారు. ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభం మీడియా లేకపోతే సమాజం స్థిరంగా ఉండదన్నారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల మీడియాపై నమ్మకం మరింత బలపడుతుందన్నారు.


డ్రాయింగ్ వేసిన విద్యార్థినులతో ఆర్డీఓ ఉమారాణి, నిర్వాహకుడు మోహన్‌రావు

ఉద్యోగులందరూ సమానమే

- ఎవరైనా నేరుగా సమస్యలు చెప్పుకోవచ్చు
- కేయూ వీసీ కె. ప్రతాప్‌రెడ్డి

కేయూ క్యాంపస్: యూనివర్సిటీలో బోధన, బోధనేతర ఉద్యోగులందరూ తనకు సమానమేనని, ఎవరైనా నేరుగా తనను కలిసి సమస్యలు విన్నవించుకోవచ్చని, తనపరిధిలోని సమస్యలు పరిష్కరిస్తానని, మిగతావి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని కాకతీయ యూనివర్సిటీ వీసీ కె. ప్రతాప్‌రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం రాత్రి కేయూ సెనెట్‌హాల్‌లో ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగుల పదోన్నతుల విషయంలో కమిటీ వేసి ఆ నివేదికల ఆధారంగానే పదోన్నతుల కల్పనకు ముందుకెళ్తానని స్పష్టం చేశారు. కేయూ ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఈసం నారాయణ, జనరల్‌సెక్రటరీ డాక్టర్ పుల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ యూనివర్సిటీలోని కీలక పదవులను ఎస్సీ, ఎస్టీ ప్రొఫెసర్లకు రొటేషన్ ప్రకారం కేటాయించాలని కోరారు. అనంతరం అసోసియేషన్ బాధ్యులు వీసీ ప్రతాప్‌రెడ్డిని సన్మానించారు.

నైపుణ్యాలపై పట్టుసాధించాలి..

ప్రస్తుతం జాబ్ మార్కెట్‌లో పోటీ తట్టుకోవాలంటే హైటెక్ స్కిల్స్‌పై పట్టుసాధించాలని వీసీ కె. ప్రతాప్‌రెడ్డి అన్నారు.గురువారం కేయూలోని జీయాలజీ విభాగం అధిపతి మల్లికార్జున్ రెడ్డి సారథ్యంలో ఆ విభాగంలో ఏర్పాటుచేసిన జియో ఇన్‌ఫర్మేషన్ సిస్టమ్ ల్యాబ్, ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాంను ప్రారంభించి మాట్లాడారు. ప్రత్యేక అతిథులుగా అమెరికా సంయుక్త రాష్ట్రాల్లోని బోర్న్‌టెక్ సొల్యూషన్స్ సంస్థ చీఫ్ గ్రోత్ ఆఫీసర్ యుగేంధర్ గూడూరు, శ్రీకాంత్ పారెపెల్లి, కేయూ రిజిస్ట్రార్ పి. మల్లారెడ్డి, యూనివర్సిటీ కాలేజీ ప్రిన్సిపాల్ బి. సురేశ్‌లాల్,సైన్స్ కోర్సుల డీన్ జి. హనుమంతు తదితరులు పాల్గొన్నారు.


వీసీ ప్రతాప్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం బాధ్యులు, తదితరులు

బీసీ సమాజంపై బీజేపీకి చిత్తశుద్ధి లేదు

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్


మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

కాజీపేట రూరల్ : తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం చేపట్టిన కులగణనకు వ్యతిరేకంగా బీజేపీ కుట్రలు చేస్తోందని, బీసీ సమాజంపై ఆ పార్టీకి చిత్తశుద్ధి లేదని, కులగణన వ్యతిరేకిస్తున్న పార్టీలు ఖబడ్దార్ అని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. శ్రీనివాస్ గౌడ్ చేపట్టిన కుల గణన చైతన్య యాత్రలో భాగంగా గురువారం కాజీపేట ఫాతిమానగర్ వైష్ణవిగ్రాండ్ హోటల్‌లో ఉమ్మడి జిల్లా బీసీ సంఘం అధ్యక్షుడు వడ్లకొండ వేణు గోపాల్ గౌడ్ అధ్యక్షతన బీసీ రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ కులగణన వ్యతిరేకిస్తున్న పార్టీలకు పుట్టగతులు ఉండవన్నారు. సంక్షేమ పథకాలకు సమగ్ర కులగణనకు ఎలాంటి సంబంధం లేదని, ప్రజలు భయాందోళనలు వీడాలన్నారు. బీసీ రిజర్వేషన్ల పెంపునకే రాష్ట్రంలో సమగ్ర కులగణన జరుగుతోందని, దీనివల్ల ఎవరికి నష్టం వాటిల్లదన్నారు. జాతీయ అధికార ప్రతినిధి తీగల ప్రదీప్‌గౌడ్ మాట్లాడుతూ కులగణనపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత అన్ని కుల సంఘాలపై ఉందన్నారు. కలగణనను బీసీలు నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్ తరాలను మోసం చేసినట్లేనన్నారు. బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రవికృష్ణగౌడ్ మాట్లాడుతూ స్థానిక ఎన్నికల లోపు కులగణన పూర్తి చేయాలని, కులగణనను అడ్డుకోవాలని చూస్తే దేనికైనా తెగిస్తామని హెచ్చరించారు. రిటైర్డ్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం కులగణన పై ప్రజల్లో ఇంకా అవగాహన పెంచాలన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కుల్కచర్ల శ్రీనివాస్‌ముదిరాజ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాడి మల్లయ్యయాదవ్, బచ్చు ఆనందం, గౌడ రాష్ట్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొనగాని యాదగిరిగౌడ్, బీసీ సంఘం నాయకులు ఏడునూరి రాజమౌళి, అసిస్టెంట్ ప్రొఫెసర్ చిర్ర రాజు, బీసీ విద్యార్థి నాయకులు ఆరేగంటి నాగరాజు, డాక్టర్ కూరపాటి రమేశ్, అడ్వకేట్ సాయిని నరేందర్, తాడిశెట్టి క్రాంతి కుమార్, చిప్ప వెంకటేశ్వర్లు, జనగాం శ్రీనివాస్, కాసగాని అశోక్, మడిశెట్టి నాగరాజు పటేల్, తుపాకుల రవి, బీసీ సంఘం మహిళా నాయకులు మాధం పద్మజాదేవి, సులోచన, తదితరులు పాల్గొన్నారు.

కొజ్జోడు అన్నాడని.. నరికి చంపాడు

- భార్య, కుమారుడి కళ్లెదుటే ఘాతుకం
- డబ్బు లావాదేవీల విషయంలో గొడవ
- ఎల్లారెడ్డిగూడెంలో ఘటన


పరశురాములు (ఫైల్)


నిందితుడు మహేందర్

రఘునాథపల్లి: అప్పు చెల్లించమన్నందుకు కొజ్జోడు అని అవమానించాడని ఓ తాపీ మేస్త్రీని ఓ వ్యక్తి దారుణంగా నరికి చంపాడు. ఈ ఘటన గురువారం జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం ఎల్లారెడ్డిగూడెంలో జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గంపల పరశురాములు (40) అదే గ్రామానికి చెందిన పర్వత మహేందర్ ఇంటి నిర్మాణ పనులు చేశాడు. మృతుడి భార్య సంధ్య.. భర్తతో పాటు పనికి వెళ్లేది. ఈ సమయంలో సంధ్య అనారోగ్యానికి గురైంది. వైద్య పరీక్షలు నిర్వహించగా క్యాన్సర్ అని నిర్ధారణ అయింది. దీంతో చికిత్స నిమిత్తం పరశురాములు.. మహేందర్ వద్ద రూ. 80 వేలు అప్పు తీసుకున్నాడు. పనుల కింద కొంత అప్పు చెల్లించగా మరి కొన్ని డబ్బులు ఇవ్వాల్సి ఉంది. పలుమార్లు అడిగినా ఇవ్వకపోవడంతో ఇటీవల ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో తనను కొజ్జోడు అన్నాడని మహేందర్.. పరశురాములుపై పగ పెంచుకున్నాడు. బుధవారం రాత్రి మహేందర్ పలుమార్లు తన ఇంటికి రావాలని ఫోన్ చేయడంతో 12.45 గంటల సమయంలో పరశురాములు వెళ్లాడు. ఆయన వెనుక భార్య సంధ్య, కుమారుడు అనిరుధ్ వెళ్లారు. అప్పటికే కత్తితో సిద్ధంగా ఉన్న మహేందర్ తన ఇంటి ముందుకు పరశురాములు రాగానే నన్ను కొజ్జోడు అంటావా అంటూ తలపై దారుణంగా నరికాడు. దీంతో పరశురాములు అక్కడికక్కడే మృతి చెందాడు. హత్య చేసిన వెంటనే నిందితుడు పోలీసులకు లొంగిపోయినట్లు సమాచారం. దీనిపై సమాచారం అందుకున్న స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ భీంశర్మ, జనగామ రూరల్ సీఐ ఎడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సై నరేశ్ గ్రామానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనగామ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై మృతుడి భార్య ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.

మొత్తుకున్నా.. ఒక్కరూ రాలేదు

తన భర్తను నరికేస్తుండగా లబోదిబోమని మొత్తుకున్నా ఏ ఒక్కరూ రాలేదని మృతుడి భార్య సంధ్య జనగామ ఆసుపత్రి వద్ద కన్నీటిపర్యంతమైంది. మొదటి కత్తి వేటు పడినప్పుడు గ్రామస్తులెవరైనా ముందుకు వచ్చి ఉంటే తన భర్త బతికేవాడని వాపోయింది. కాగా, హత్య ఘటన నేపథ్యంలో గ్రామంలో ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

చేతి యంత్రాలతో విత్తనాలు విత్తుకోవచ్చు

- కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ రాజన్న


యంత్రం పనితీరును పరిశీలిస్తున్న రాజన్న

ఖిలా వరంగల్: చేతి యంత్రాలతో విత్తనాలను విత్తుకోవచ్చని మామునూరు కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ రాజన్న తెలిపారు. ఈమేరకు వరంగల్ మామునూరు పీవీనరసింహారావు పశు వైద్య కళాశాల ఆధ్వర్యంలో కృషి విజ్ఞానం కేంద్రం శాస్త్రవేత్తల నేతృత్వంలో గురువారం యాసంగి పంటలను పరిశీలించారు. అనంతరం దత్తగ్రామాలు ఎర్రబెల్లి, ఒంటిమామిడిపల్లి రైతులకు అటరీ డైరెక్టర్ షేక్ ఎన్.మీరాతో కలిసి రాజన్న చేతుల మీదుగా చేతితో విత్తనం విత్తే యంత్రాలను పంపిణీ చేశారు. అనంతరం డాక్టర్ రాజన్న మాట్లాడారు. ఈ యంత్రంతో 80 రకాల విత్తనాలు విత్తుకోవచ్చన్నారు. ప్రధానంగా మొక్కజొన్న, వేరుశనగ, పెసరు, ఆముదం, కంది వంటి విత్తనాలను విత్తుకోచ్చన్నారు. కార్యక్రమంలో సస్యరక్షణ శాస్త్రవేత్తలు రాజు, సౌమ్య, రైతులు వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ గదిలో గంజాయి

- రెడ్‌హ్యాండెడ్‌గా చిక్కిన ఐదుగురు విద్యార్థులు

హసన్‌పర్తి: వరంగల్ నగర శివారులోని ఓ ఇంజనీరింగ్ కళాశాల హాస్టల్ గదిలోనే గంజాయి తాగుతూ ఐదుగురు విద్యార్థులు పట్టుబడ్డారు. ఈ ఘటన గురువారం రాత్రి జరిగింది. కాలేజీ హాస్టల్ గదిలో విద్యార్థులు గంజాయి తాగుతున్నట్లు నార్కోటిక్ బృందానికి సమాచారం రాగా, హుటాహుటిన వారు కాలేజీకి వెళ్లి తనిఖీ చేశారు. ఐదుగురు విద్యార్థులు గంజాయి తాగుతుండగా పట్టుకున్నారు. అనంతరం గదిలో సోదాలు చేయగా గంజాయి ప్యాకెట్లు గుర్తించినట్లు తెలిసింది. పట్టుబడిన వారిలో ఇద్దరు బీటెక్ ద్వితీయ సంవత్సరం, ముగ్గురు తృతీయ సంవత్సరం విద్యార్థులున్నట్లు తెలిసింది. దీనిపై హసన్‌పర్తి పోలీసులను వివరణ కోరగా తమకు నార్కోటిక్ బృందంనుంచి ఎటువంటి సమాచారం అందలేదని తెలిపారు.

ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్‌గా సదానందం


సదానందం

విద్యారణ్యపురి: ఓపెన్ స్కూల్ ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్‌గా జయశంకర్ భూపాలపల్లి జిల్లా కొత్తపల్లిగోరి మండలం నిజాంపల్లి ఎంపీపీఎస్ ఎల్‌ఎఫ్‌ఎల్‌హెచ్‌ఎం అనగోని సదానందం నియమితులయ్యారు.ఈమేరకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఉత్తర్వులు జారీచేయగా బాధ్యతలు స్వీకరించినట్లు సదానందం గురువారం తెలిపారు. సదానందం 1989 డీఎస్సీలో ఎస్‌జీటీగా నియామకం కాగా కరీంనగర్‌జిల్లా సైదాపూర్ మండలంలో సుమారు 15 సంవత్సరాలు ఎంఆర్‌పీగా విధులు నిర్వర్తించారు.2013లో ఎల్‌ఎఫ్ఎల్ హెచ్‌ఎంగా పదోన్నతి పొందారు. రుద్రారం బాలునాయక్ తండాలోని పాఠశాలలో విధులు నిర్వర్తించారు. 317జీఓతో రేగొండ మండలం నిజాంపల్లి ఎంపీపీఎస్ ఎల్‌ఎఫ్‌ఎల్‌హెచ్‌ంగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఇప్పటివరకు ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్‌గా విధులు నిర్వర్తిస్తున్న మురాలశంకర్‌రావు స్థానంలో తనను నియమించారని సదానందం తెలిపారు.